ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కోడిపందేలు, జూదానికి అనుమతులు లేవు : డీఎస్పీ

పులివెందులటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గంలో కోడిపందేలు, జూదాలు నిర్వహించరాదని, వాటిని అనుమతులు లేవని డీఎస్పీ మురళీ తెలిపారు. ఆదివారం ఆయన పులివెందుల అర్బన్ పోలీసుస్టేషనులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక బృందాలతో నియోజకవర్గవ్యాప్తంగా కోడిపందేలు, జూదాలపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై 112కు సమాచారం అందించాలన్నారు. సంక్రాంతి పండుగను ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పండుగ సందర్భంగా సొంత ఊర్లకు వెళుతున్న వారు తమ ఇంటి భద్రతపై జాగ్రత్తగా ఉండాలన్నారు. దొంగలను అరికట్టడానికి ఏపీ పోలీసుశాఖ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ రూపొందించిందన్నారు. ఎక్కడైనా ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు తెలిస్తే తక్షణం పోలీసు స్టేషన్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు శ్రేయస్సే ధ్యేయంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మెరుగైన సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఎస్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళి

జిల్లాలో కోడిపందేలు జోరందుకుంటున్నాయి. ఒకప్పుడు ఇతర జిల్లాలకు వెళ్లే జిల్లా వాసులు ఇప్పుడు స్టైల్ మార్చేశారు. ఎక్కడెక్కడికో వెళ్లేది ఎందుకు.. ఇక్కడే నిర్వహిస్తే సరిపోతుందనుకున్నారో ఏమో.. ఇప్పటికే బరులు సిద్ధం చేశారు. జిల్లాలో పులివెందుల, ప్రొద్దుటూరు, కమలాపురం నియోజకవర్గాల్లో పెద్దఎత్తున కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. తమిళనాడు, చిత్తూరు నుంచి పందెంకోళ్లను దిగుమతి చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. లక్షల్లో పందేలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. కాగా కోడి పందేలకు ఎటువంటి అనుమతులు లేవని పోలీసులు చెబుతుండగా.. తాము మాత్రం తగ్గేదేలా అని నిర్వాహకులు అంటున్నారు. మరి చూద్దాం.. పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో.

బరి గీయాల్సిందే.. కత్తి కట్టాల్సిందే



- కోడిపందేలకు సర్వం సిద్ధం
- తమిళనాడు, చిత్తూరు నుంచి పందెంకోళ్ల దిగుమతి
- మూడురోజుల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు
- ఒక్కోచోట రూ.10లక్షల నుంచి రూ.20 లక్షల మధ్య కాయ్ రాజా కాయ్
- కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు అంటున్న పోలీసులు
- తగ్గేదేలే అంటున్న నిర్వాహకులు



లింగాల మండలంలో కోడిపందేల కోసం బరులు ఏర్పాటు చేసిన దృశ్యం



కడప, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటే మన జిల్లాలో ఒకప్పుడు భోగిమంటలు, రేగిపండ్లతో స్నానం, పిండివంటలు, ముగ్గులు పండుగ, చివరి రోజున పార్వేటతో సందడిగా జరిగేవి. ఇక కృష్ణా, గుటూరు, ఈస్ట్, వెస్ట్ జిల్లాలలో పండుగ అంటేనే కోడిపందేలు. అక్కడ కోట్లాది రూపాయల్లో జరుగుతాయి. కొంతమంది మన జిల్లా వాసులు కోడిపందేలకు భీమవరం, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే ఇటీవల కాలంలో మనోళ్ల మైండ్‌సెట్ కూడా మారిపోయింది. కోడిపందేల కోసం ఎగేసుకొని అంత దూరం వెళ్లేది ఎందుకు.. మనం ఇక్కడే నిర్వహిస్తే పోలే అనుకున్నారు. ఇక జిల్లాలో కొన్నిచోట్ల అక్కడక్కడ కోడిపందేలు నిర్వహిస్తున్నప్పటికీ పులివెందులే ఫేమస్‌గా మారిందంటారు. బెట్టింగ్‌కు ప్రొద్దుటూరు అడ్డా అయితే మిగతా చోట్ల కోడిపందేలు మాత్రం అక్కడక్కడ జరుగుతున్నప్పటికీ పులివెందులలో ఎక్కువగా జరుగుతాయంటారు. వైసీపీ కాలంలో పులివెందులలో ప్రతి ఏటా పండుగను నిర్వహిస్తున్నారు. వారి ప్రభుత్వంలో వారు నిర్వహిస్తే సరిపోతుందా.. మేమేం తక్కువ అంటూ ఈసారి పందేలు నిర్వహించేందుకు పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో పండుగ మూడు రోజుల పాటు కత్తి కట్టాల్సిందే.. బరిలో దిగాల్సిందే అన్నట్లుగా పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. ఇక పోలీసులు హెచ్చరించడం నిర్వాహకులు లైట్ తీసుకోవడం, ఎస్పీ లేకపోవడంతో కొందరు కూటమి నేతలు కూడా ఆసక్తి చూపుతుండడంతో ఈ సంక్రాంతికి తగ్గేదేలే అన్నట్లుగా సిద్ధమవుతున్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజులు పందేల ఏర్పాటుకు బరులు సిద్ధం చేశారు.

పందేలకు బరులు సిద్ధం

జిల్లాలో ప్రొద్దుటూరు, కమలాపురం, పులివెందుల నియోజకవర్గాల్లో పెద్దఎత్తున కోడిపందేలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం పంచాయతీ ఉప్పాగు యానాది కాలనీ, కొత్తపల్లె, లింగాపురం, ఉప్పరపల్లె, బొజ్జవారిపల్లె, కేసీకెనాల్ పరిధి, చాపాడులో కోడిపందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఇక్కడ ప్రొద్దుటూరు పోలీసులు కూడా ముందస్తు నిఘా పెట్టి ఉప్పాగు యానాది కాలనీకి చెందిన కోడిపందెంరాయుళ్లపై తహసీల్దార్ వద్ద రూరల్ ఎస్ఐ మహమ్మద్ రఫీ బైండోవర్ చేయించారు. ఇక చెన్నూరు, సీకెదిన్నె మండలంలో కూడా సిద్ధమవుతున్నారు.

పులివెందుల స్టైలే వేరు

జిల్లాలో పులివెందులకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ నుంచి ఇద్దరు సీఎంలు రాష్ట్రాన్ని ఏలారు. కవులు, సినీనటులు వివిధ రంగాలలో ప్రముఖులు ఉన్నారు. అయితే జూదంలో కూడా పులివెందులకు ఓ క్రేజ్ ఉంది. ఎలాగంటే జిల్లాలో నిర్వహిస్తున్న కోడిపందేలు ఒక ఎత్తయితే పులివెందుల ఇంకో ఎత్తుకావడం, అక్కడే భారీఎత్తున పందేలు జరుగుతుండడం గమనార్హం.

పందేలకు కాలు దువ్వుతున్న కోళ్లు

పులివెందుల నియోజవకర్గంలో ఏడు మండలాల్లోని దాదాపు 14 నుంచి 20 గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించేందుకు అక్కడి నాయకులు సిద్ధమవుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వేంపల్లె మండలంలో అలవలపాడు, రామిరెడ్డిపల్లె, గిడ్డంగివారిపల్లె, ఇడుపులపాయ, వెలమవారిపల్లె గ్రామాల్లోనూ, వేముల మండలానికి వస్తే పెద్దజూటూరు, వేముల, భూమయ్యగారిపల్లె గ్రామాల్లోనూ, పులివెందుల మండలానికి వస్తే కొత్తపల్లె, పులివెందుల పట్టణంలో ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలో చెన్నారెడ్డికాలనీ, నల్లపురెడ్డిపల్లె, ఎర్రిపల్లె గ్రామాల్లోనూ, సింహాద్రిపురం మండల విషయానికొస్తే కసనూరు, హిమకుంట్ల, లింగాల మండలంలో మురారిచింతల, దొండ్లవాగు, తొండూరు మండలంలో మల్లేల, ఇనగలూరు, గంగనపల్లె గ్రామాలు, చక్రాయపేట మండల విషయానికొస్తే కుమార్లకాల్వ, చెరువుకాంపల్లె గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇందులో కొన్ని గ్రామాల్లో పరిస్థితులు అనుకూలించకపోతే మరో గ్రామానికి వెళ్లి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికే పలువురు బరిలో దించేందుకు కోళ్లను బయట ప్రాంతాల నుంచి పులివెందుల ప్రాంతానికి తెచ్చుకున్నట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో కోడిపందేలు జరిగిన తీరుతో ఆ ప్రాంత ప్రజలే నివ్వెరపోయారు. ఎప్పుడూ లేని సంస్కృతి ఇక్కడకు వచ్చిందని కొందరు ఆవేదన వ్యక్తం చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఆనవాయితీ మరింత ముందుకు తీసుకెళ్లేందుకు టీడీపీ సిద్ధమైంది.

కత్తికట్టి బరిలో దిగేందుకు కోళ్లు సిద్ధం

నిర్వాహకులు చిత్తూరు, తమిళనాడు ప్రాంతాల నుంచి పందెంకోళ్లను తీసుకొచ్చారు. డేగ, నెమలి, పింగాలి, పచ్చకాకి, కాకి డేగ, ఎర్రమెయిల, ఒడుకాకి, అడసంగి జాతిరకం పందెం కోళ్లను సాకుతున్నారు. ఒక్కో పందెంకోడిని రూ.30 నుంచి లక్ష రూపాయల దాకా వెచ్చించి వాటికి బలిష్టమైన ఆహారాన్ని అందిస్తున్నారు.

చేతులు మారనున్న లక్షల రూపాయలు

కోడిపందేలపై భారీపందేలు కాసే జిల్లాకు చెందిన కొందరు బెట్టింగ్‌రాయుళ్లు విజయవాడ, భీమవరం, ఏలూరుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే చాలా మంది జూదగాళ్లు ఇక్కడ జరిగే కోడిపందేలలో పాల్గొననున్నారు. భోగి, మకర, కనుమ పండుగ సందర్భంగా పందేలు నిర్వహిస్తున్నారు. అందుకు తగ్గట్లుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఒక్కో కోడిపై లక్షలోపు వేసుకున్న ఒక్కో చోట కనీసం రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల మేర పందేలు జరగనున్నాయి. ఈ లెక్కన మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు చేతులు మారనున్నాయి.

పోలీసులకు సవాల్

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు. ఇది కొన్నేళ్లుగా పోలీసులు చెప్పే డైలాగ్. జనం కూడా లైట్ తీసుకుంటున్నారు. కొందరు తెలియని వాళ్లు కూడా ఓహో ఇక్కడ కోడిపందేలు జరుగుతాయా అని తెలుసుకునేలా వారి హెచ్చరిక ఉంది. వైసీపీ హయాంలో ప్రతి ఏటా నిర్వహించారు. ఇప్పుడెందుకు అడ్డుకుంటారంటూ కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిజంగానే పోలీసులు ఆపుతారా అనే చర్చ కూడా సాగుతోంది.

కోడిపందేలను అడ్డుకునే దమ్ము ఉందా ?

పులివెందుల నియోజకవర్గంలో ఈ సంక్రాంతికి కోడిపందేలు లక్షలు దాటి కోట్లలో సాగే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలిసింది. ఈ పందేలు అధికార పార్టీలోని కొందరు నాయకులే ప్రోత్సహించి నిర్వహిస్తున్నట్లు సమాచారం. కానీ సాక్షాత్తు పులివెందుల డీఎస్పీ మురళినాయక్ కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటన చేశారు. కానీ ఈ ప్రకటనలు ఏవీ పనిచేసేలా ఆ ప్రాంతంలో కనిపించడం లేదు. ఎందుకంటే పులివెందుల పట్టణంలో పలుచోట్ల విచ్చలవిడిగా మాట్కా రాస్తున్నా, పులివెందులకు కూతవేటు దూరంలో గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గ్యాంబ్లింగ్, మట్కా, కోడిపందేలు కోట్లు సంపాదించాలనే ఆలోచనలో కొంతమంది టీడీపీ నాయకులు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. ఈ సంక్రాంతికి నిర్వహించేందుకు ఆదివారమే పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె, ఎర్రిపల్లె గ్రామాల్లో కోడిపందేలు ప్రారంభించినట్లు తెలిసింది. అయితే ఈ కోడిపందేలకు పోలీసులు సహకరిస్తారా.. లేక అడ్డుకుంటారా అనేది వేచి చూడాల్సిందే.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సుపరిపాలనలో ఆకాంక్షిత జిల్లాగా వైఎస్సార్ కడప జిల్లాలో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందుతున్నందుకు సంతోషంగా ఉందని, ఈ సంక్రాంతి పండుగ జిల్లా ప్రజలకు మరిన్ని శుభాలు అందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. భోగిమంటల వెచ్చటి వెలుగులు, పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, మకర సంక్రాంతి కాంతులతో ప్రతి ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని, కనుమ కాంతులతో పల్లె సీమలు పశుసంపద, వ్యవసాయం, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

అవయవదానంతో అమరుడై..

- కన్నుమూసినా జీవిస్తున్న గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి
- గుండె, కాలేయం, కిడ్నీలను దానం చేసిన కుటుంబీకులు

7



సంక్రాంతి సంబరం

- నేడు భోగి ● రేపు మకర సంక్రాంతి ● 15న కనుమ పండుగ

కడప కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): హిందువుల తొలి పండుగ.. పెద్ద పండుగ.. సంక్రాంతి రానే వచ్చింది. ఒకప్పటి కోడిపందేలు, ఎడ్ల పందేలు, గంగిరెద్దులు, హరిదాసులు కాలక్రమేణ తగ్గినా.. పండుగ సంబరం మాత్రం తగ్గేదేలా అనిపిస్తోంది. జిల్లా కేంద్రమైన కడప నగరంలో గల వైవీస్ట్రీట్, బీకేఎం స్ట్రీట్, పాతమార్కెట్ ఆదివారం కిటకిటలాడాయి. పండుగ సామగ్రి తీసుకొనే వారు.. నూతన దుస్తులు.. తదితర సరంజామా కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో రద్దీగా తయారైంది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నగర రోడ్లు ట్రాఫిక్‌ను తలపించాయి. ఇక కొత్త అల్లుళ్లు, బంధువులతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా కళకళలాడుతున్నాయి. ఇంట్లో కావాల్సిన సామగ్రి ఇప్పటికే తెచ్చేసుకున్నారు. అయితే నిత్యావసరాల ధరలు పెరగడంతో ఒకింత ఇబ్బంది పడ్డారు. కాగా నేడు భోగి పండుగ సందర్భంగా తెల్లవారు జాము నుంచే భోగిమంటలు, పిండి వంటలు చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు.



కిక్కిరిసిన కడప నగరంలోని వైవీస్ట్రీట్

రాయలసీమ హక్కులపై దగా

- మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు రావాల్సిన పరిశ్రమలు, సంస్థలు ప్రాజెక్టులు ఇవ్వకుండా, ఇక్కడి వారి హక్కులపై ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని మాజీ మంత్రి, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు, సింగనమల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో కడప ఐఎంఏ హాల్లో కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన సీమ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ మంచి బిజినెస్, సాంకేతిక సేవలు, లాభాలు, శాఖలు, ఇలా అనేక అంశాల్లో ఏపీజీబీ దేశంలోనే అగ్రగామి బ్యాంకుగా ఉన్నా విలీనం తర్వాత దాని ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించాలనుకోవడం రాజకీయ దుర్మార్గమని, దీనిపై మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు అంతా ఎవరి స్థాయిలో వారు ప్రతిఘటించాలని, లేకపోతే చరిత్రలో దోషులుగా మిగిలిపోతామన్నారు. ఏపీ ఎస్సీ ఎస్టీ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కన్వీనర్ వై.జయరాజు మాట్లాడుతూ హైకోర్టు బదులు కర్నూలులో బెంచ్ పెడతామంటూ అదేదో ఉద్ధరిస్తున్నట్లు మాట్లాడుతున్నారని, ఇది రాయలసీమ హక్కుల నిరాకరణేనని అన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం, నేటి ప్రభుత్వాలు రాయలసీమ పట్ల బాధ్యతగా వ్యవహరించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు జి.చంద్రశేఖర్, గాలి చంద్ర, సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, సిటిజన్స్ ఫోరం కన్వీనర్ లక్ష్మీరాజా, జోగిరామిరెడ్డి, రామాంజనేయులు, మల్లెల భాస్కర్, పలు సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు, వివిధ రంగాల ముఖ్యులు హాజరయ్యారు.



సదస్సులో మాట్లాడుతున్న శైలజానాథ్

అర్హులకు పింఛన్లు అందించేందుకే లైవ్ సర్టిఫికెట్

- కడప ఖజానా సబ్ ట్రెజరీ అధికారి గోవింద రవికుమార్



పటాపట్

కడప కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ విరమణ చేసిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం పెన్షన్లు అందించే క్రమంలో ప్రతి ఏటా లైవ్ సర్టిఫికెట్ తప్పక సమర్పించాల్సి ఉంటుందని కడప ఖజానా సబ్ ట్రెజరీ అధికారి గోవింద రవికుమార్ పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కొత్తగా పెన్షన్లు ఎలా పొందాలి? తల్లిదండ్రులు చనిపోతే పోషణార్థం బిడ్డలకు ఎంత వయసు వరకు పెన్షన్ సదుపాయం అందుతుందనే విషయాలను ఆయన ఆంధ్రజ్యోతి పటాపట్ ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎంతమంది పెన్షనర్లు ఉన్నారు? ప్రతినెలా పెన్షన్ అందుతోందా?

జవాబు: 18,500 మంది ప్రభుత్వ పెన్షన్‌దారులు ఉన్నారు. వారందరికీ ఒకటో తేదీ నాటికే ప్రభుత్వం పెన్షన్లు అందిస్తోంది.

ప్రశ్న: లైవ్ సర్టిఫికెట్ ఎందుకు ఇవ్వాలి ?

జవాబు: ఉద్యోగ విరమణ చేసి పింఛన్లు పొందే వారు ఆ ఏడాది అంతా క్రమం తప్పకుండా తీసుకునేందుకు జీవిస్తున్నట్లు ఏటా జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేది వరకు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆఫీసుకు వచ్చి బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. వేలి ముద్రలు పడకపోతే ఐరీష్‌ను పరిగణలోకి తీసుకుంటాము.

ప్రశ్న: మంచాలకు పరిమితమైన వారికి లైవ్ సర్టిఫికెట్ ఎలా ?

జవాబు: అనారోగ్య కారణాలతో మంచానికి పరిమితమైన వారు సమాచారం ఇస్తే తమ సిబ్బంది వెళ్లి వాస్తవ పరిస్థితులను అధికారులకు వాట్సాప్ ద్వారా కాల్ చేయించిన మీదట ఆమోదిస్తారన్నారు. ఒకవేళ ఐరీష్, తంబ్ సమస్యలు ఉంటే ఫిజికల్‌గా ఫారం పూరించి ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రశ్న: ఇతర ప్రాంతాల్లో ఉండే వారి పరిస్థితి ?

జవాబు: ఇతర రాష్ట్రాలు, జిల్లాలో ఉండే వారు పోస్టాఫీసుల నుంచి జీవన ప్రమాణం ద్వారా బయోమెట్రిక్ వేయవచ్చు. విదేశాల్లో ఉంటే అక్కడ ఎంబసీ నుంచి సర్టిఫికెట్ పొంది, ఇండియా ఎంబసీలో అప్రూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది. వాళ్ల ఖాతాల్లో నెల నెలా పింఛన్ జమ అవుతుంది.

ప్రశ్న: పెన్షనరు చనిపోతే ప్రభుత్వం ఆదుకుంటుందా?

జవాబు: పెన్షనర్లు చనిపోతే మట్టి ఖర్చుల కింద ప్రభుత్వం రూ.25 వేలు ఇస్తుంది. ఒక వేళ భార్యలేక పోతే పిల్లలు కుటుంబ అఫిడవిట్ సమర్పిస్తే వారి ఖాతాలో జమ చేస్తారు.

ప్రశ్న: కుటుంబ సభ్యులకు పెన్షన్ అందే అవకాశాలు ఉన్నాయా?

జవాబు: ఉద్యోగ విరమణ తరువాత మరణిస్తే అతని భార్యకు పెన్షన్ వస్తుంది. ఆమె కూడా లేకపోతే ఆ కుటుంబంలో వితంతురాలైన కుమార్తెకు లేదా దివ్యాంగులకు, కోర్టుద్వారా విడాకులు తీసుకున్న కుమార్తెకు ఇచ్చే అవకాశాలున్నాయి. ముఖ్యంగా వివాహం కాని వారు 25 ఏళ్ల వరకు పెన్షన్ పొందవచ్చు.

ప్రశ్న: ఏ వయసు వారికి ఎంత పెన్షన్ వస్తుంది?

జవాబు: 70 ఏళ్ల దాటిన వారికి 7 శాతం బెనిఫిట్స్ ఉంటాయి. 75 ఏళ్ల దాటితే 12 శాతం, 80 ఏళ్ల దాటితే 20 శాతం, 85 ఏళ్ల దాటితే 25 శాతం, 90 ఏళ్ల దాటితే 30 శాతం, ఆపై వయసు ఉంటే 50 శాతం పెన్షన్ ప్రతి నెలా అదనంగా పెన్షన్ పొందవచ్చు.

అంతా రాజకీయమే..!

- రేషన్ షాపుల నోటిఫికేషన్‌లో రిజర్వేషన్లు గల్లంతు
- 53 షాపులకు గానూ 33 వాటికే నోటిఫికేషన్
- 6-ఏ కేసుల సాకుతో మిగిలిన షాపులు అధికార పార్టీ కార్యకర్తలకు..?
- కోర్టు మెట్లెక్కిన డీలర్లు

కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో 53 రేషన్ షాపులకు నోటిఫికేషన్ జారీ అయింది. అయితే ఈ నోటిఫికేషన్‌లో గతంలో ఉన్న రిజర్వేషన్లు కొన్ని తారుమారు కాగా.. మరికొన్ని గల్లంతు అయ్యాయి. రాజకీయ జోక్యంతో పాటు కిందిస్థాయి అధికారులు చేతివాటం ప్రదర్శించడంతో రిజర్వేషన్లు గల్లంతు అయ్యాయని అంటున్నారు. ఏళ్లతరబడి డీలర్ షాపుల నిర్వహణలో అపార అనుభవం ఉన్న కిందిస్థాయి అధికారులు తాము చెప్పిందే వేదం, చేసిందే రిజర్వేషన్లు అన్న చందంగా చక్రం తిప్పారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కడప కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువు దీరిన నాటి నుంచి తెలుగుతమ్ముళ్ల చూపు రేషన్ షాపులపై ఉంది. దీంతో ఇన్‌చార్జి డీలర్లపై 6-ఏ కేసులు నమోదు చేసి ఆ షాపులను కార్యకర్తలకు పందేరం చేశారని ప్రచారం సాగుతోంది. కడపలో 53 డీలర్ షాపులకు నోటిఫికేషన్ జారీకావాల్సి ఉండగా అందులో కేవలం 33 షాపులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేయడం ఇందుకు తార్కాణం. నిన్నమొన్నటి దాకా ఉన్న రిజర్వేషన్ల స్థానంలో పాత జీవో నెంబర్లు 1977, 52తో పాటు మరో జీవో నెంబరు 32ను జతచేసి ప్రామాణికంగా తీసుకుని 6 షాపులకు సంబంధించి రిజర్వేషన్లలో గోల్‌మాల్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2017నుంచి ఇన్‌చార్జిలు డీలర్లుగా ఉన్న 15 మంది ఇప్పటికే కోర్టు మెట్లెక్కారు.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

ఏళ్లతరబడి ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగులకు కొత్తగా జారీ అయిన డీలర్ల నోటిఫికేషన్ ఆశలు చిగురింప చేసింది. పరీక్షలు కష్టపడి రాసి ఏదో రకంగా చౌకదుకాణాలు దక్కించుకుని ఉపాధి పొందవచ్చని కలలు కన్నారు. కానీ నోటిఫికేషన్ జారీ నాటి నుంచే రిజర్వేషన్ల వ్యవహారంపై డీలర్లలో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు వారు కోర్టుకు వెళ్లనున్నారని ప్రచారం జరగడంతో వీరి ఆశలు అడుగంటాయి. ఎందుకంటే 2017-18లో అప్పటి ఆర్డీవో దేవేంద్రరెడ్డి చౌకదుకాణాల డీలర్ల నోటిఫికేషన్‌లో రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్లు గోల్‌మాల్ చేశారంటూ ఇన్‌చార్జి డీలర్లు కోర్టుకు వెళ్లారు. అయినా డీలర్ల నియామకాల కోసం రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. కానీ రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్ల విషయంలో కోర్టు తీర్పు డీలర్లకు అనుకూలంగా రావడంతో సుమారు 40 డీలర్ షాపులకు కొత్త డీలర్ల నియామకాలు ఆగిపోయాయి. అదే పద్ధతిని మళ్లీ ఇప్పుడు అనుసరించడం చూస్తే డీలర్ల నోటిఫికేషన్‌లో ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్లు చెల్లవేమో అని పలువురు పేర్కొంటున్నారు.

తాజా ఇన్‌చార్జి డీలర్లకు రాజకీయ అండ

గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికి బియ్యం పథకంలో భాగంగా తెచ్చిన ఎండీయూ వాహనాలు తొలగిస్తారనే ప్రచారం సాగుతోంది. దీంతో అధికార పార్టీలో కొందరు కార్యకర్తల చూపు రేషన్ షాపులపై పడింది. దీంతో 2017 నుంచి ఇన్‌చార్జి డీలర్లుగా ఉన్న వారిని తొలగించే ప్రక్రియలో భాగంగా ఎన్‌ఫోర్సుమెంట్ దాడులు చేయడంతో పాటు తహశీల్దార్ల సమావేశాల్లో రాజీనామాలకు ఒత్తిడి చేశారని అంటున్నారు. అధికార పార్టీలో చోటా మోటా నేతలు డీలర్ షాపుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో కడపలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా చాలామంది డీలర్లు స్వచ్ఛందంగా తప్పుకోక తప్పలేదు. అలాంటి షాపులకు అధికార పార్టీ కార్యకర్తలను ఇన్‌చార్జి డీలర్లుగా ప్రకటించారు. ఇది జరిగి రెండు నెలలు అయ్యా కాకనే చౌకదుకాణాల డీలర్ల నియామకాలకు నోటిఫికేషన్ జారీ కావడంతో వీరంతా ఖంగుతిన్నారు. దీంతో అధికార పార్టీలో కొందరు నేతలు పెద్దల అండతో చక్రం తిప్పారనే విమర్శలు ఉన్నాయి. 53 షాపులను నోటిఫికేషన్‌లో చూపించాల్సిన అధికారులు 33 షాపులకు నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో కొత్తగా 5 షాపులను (కార్డులు విభజించడం వల్ల ఏర్పడిన) కలపడం గమనార్హం. అధికార పార్టీ అండ ఉన్న ఇన్‌చార్జి డీలర్ల షాపులను కాపాడే ప్రయత్నంలో భాగంగా ప్రస్తుతం వారు నడుపుతున్న షాపులకు 6-ఏ కేసుల సాకు చూపి నోటిఫికేషన్‌లో చూపించలేదని డీలర్లు విమర్శిస్తున్నారు.. రాజకీయ అండచూసుకుని అధికారులు వ్యవహరించిన తీరును తప్పు పడుతూ పెద్ద ఎత్తున డీలర్లు కోర్టుకెళ్లారు. దీంతో ఈ దఫా రేషన్ షాపులకు కొత్త డీలర్ల నియామకం రెవెన్యూశాఖకు సవాలే అని పలువురు పేర్కొంటున్నారు.

సంక్రాంతి వేడుకలేవీ...?

కనుమరుగవుతున్న గంగిరెద్దు ● జాడలేని గంగిరెద్దుల నృత్యాలు ● గొబ్బి ఆటలు ఆడేవారెవరు ? ● వినిపించని హరిదాసుల గొంతు





ఇంటి ముందు అలంకరించిన గొబ్బెమ్మ



గంగిరెద్దు ఆటలు (ఫైల్ ఫొటో)



బొమ్మల కొలువు

బద్వేలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నాడు సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొనేది. ఘనంగా వేడుకలను నిర్వహించుకునే వారు. కోడిపందేలు, ఎడ్ల పందాలు, రంగు రంగు ముగ్గుల్లో.. గొబ్బెమ్మలు, హరి దాసులు, గంగి రెద్దులు, కొత్త అల్లుళ్లతో సంక్రాంతి పండుగ కళకళలాడేది. పల్లెల్లో గాలి పటాల ఎగురవేత, ఇళ్లల్లో బాలికలు ఏర్పాటు చేసే బొమ్మల కొలువు, ఇంటి ముందు గంగి రెద్దుల నృత్యాలు ఇలా సంక్రాంతి పండుగ వేడుకగా జరిగేది. ఇదంతా ఒకప్పటి సంగతి. ఇప్పుడు సంక్రాంతి పండుగ మారిపోయింది. పండుగ రోజు తెల్లవారు జామున లేచి, తలంటి స్నానాలు చేసి, నూతన దుస్తులు ధరించి, మహిళలు పోటాపోటీగా రంగు రంగుల ముగ్గులువేసి ఇంటి పరిసరాలను ముచ్చటగా తయారు చేసుకునేవారు. నేడు అలాంటి దృశ్యాలు కనుమరుగవుతున్నాయి. పట్టణ వాసులు సైతం సంక్రాంతి పండుగ అనగానే పది రోజుల ముందే పల్లెకు చేరుకుని, అంతా కలసి పండుగ సంబరాల్లో మునిగే వారు. తెల్లవారు జామునే బాలసంతలు, పకీరుల వేషాలు వంటి దృశ్యాలు ఏనాడో కనుమరుగయ్యాయి. ఇంటి ముందుకు వచ్చి వంగి వంగి దండాలు పెట్టే గంగిరెద్దు నృత్యాల జాడలేకుండా పోయాయి. ఉదయాన్నే తలపాగా చుట్టుకుని ఇంటిముందు హరిదాసులు పాడే గీతాలు మచ్చుకైనా విన్పించడం లేదు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో నెలరోజుల నుంచే సందడి వాతా వరణం నెలకొనేది. ఇప్పటి పరిస్థితుల్లో పాఠశాలలు, కళాశాలలు, బీటెక్ కళాశాలలు నామమాత్రంగానే సంక్రాంతి వేడుక చేస్తున్నారు. ప్రజలకు ఇప్పుడు సంక్రాంతి పండుగ భారంగా మారింది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో ఏమీ కొనలేని పరిస్థితి ఏర్పడింది. పల్లెల్లో కరువు ఉండడంతో సంక్రాంతి పండుగను నామ మాత్రంగా చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

రెడీమేడ్ వస్తువులపై ఆసక్తి

నాడు సంక్రాంతి పండుగ వస్తుందంటే 20రోజుల ముందే పల్లెల్లో ఇండ్లల్లో వి విధ రకాలు పిండివంటలు చేసేవారు. కర్జికాయలు, కారాలు, లడ్లు, అత్తరాసలు వంటివి స్వయంగా మహిళలు చేసుకునేవారు. అయితే రెడీమెడ్‌గా దొరుకుతుండడంతో పాత కాలపు వంటలకు స్వస్తిపలికి, రెడీమెడ్‌లో లభించే వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనపరుస్తుండడంతో నాటి వంటకాలు, వాటి రుచులకు దూరమవుతున్నారు.

జాడలేని గంగిరెద్దుల నృత్యాలు

సంక్రాంతి పండుగ వచ్చిందంటే పశువులను ఎంతో అందంగా అలంకరించే సంప్రదాయం. గంగిరెద్దులను ఎంతో అందంగా అలంకరించి, ఇండ్ల ఎదుట మేళం వాయిస్తే వాటికి అనుగుణంగా గంగిరెద్దులు నృత్యం చేసేవి. ఈ నృత్యం ఎంతో ఆనందకరంగా ఉండేది. అయ్యగారికి దండంపెట్టు అని చెప్పగానే గంగిరెద్దు కిందికి వంగి దండంపెట్టడం వంటివి సంక్రాంతికి ఎంతో సందడిచేసేవి. ఆ గంగిరెద్దు యజమానికి పాత వస్త్రాలు, దాన్యము ఇచ్చేవారు. కాలానుగుణంగా ఈ గంగిరెద్దుల నృత్యాలు జాడలేకుండా పోతున్నాయి.

విన్పించని హరిదాసుల రాగం

సంక్రాంతి పండుగ రోజు గ్రామాల్లో హరిదాసుల హడావిడి ఉండేది. తలకు పాగా కట్టుకుని తంబురా చేతపట్టుకుని ఇంటి వద్దకు వచ్చి 'హరిలో రంగ హరి' అంటూ ఎంతో ముచ్చటగా రాగాలు తీసేవారు. నేడు హరిదాసుల రాగాలే విన్పించడంలేదు. రంగు రంగుల ముగ్గులువేసి, ముగ్గుల్లో గొబ్బెమ్మలను పెట్టి, బాలికలు గుమికూడి చక్క గా పాటలు పాడి ఆడుతూ సందడి చేసేవా రు. నేడు గొబ్బెమ్మలు, అలనాటి పాటలు, ఆటలు కొన్నిచోట్లే సాగుతున్నాయి.

నాటి ధాన్యపు రాశులు

తాతయ్యా ధాన్యపు రాసులు చూపించ వా.... నానమ్మా లేగదూడలు ఎక్కడ.... అమ్మమ్మా హరిదాసులేరి, గంగిరెద్దులేవీ. సంక్రాంతి పండుగకు వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న వారి పిల్లలు వేస్తున్న ప్రశ్నలు ఇవి. అయితే తాతయ్య, నానమ్మల గొంతు పెగలడం లేదు. వ్యవసాయంతో ముడిపడి సాగే సంక్రాంతిని ఈ సారి కరువు కమ్మేసింది. పల్లెల్లో పచ్చని పొలాలు బీళ్లుగా మారడంతో రైతన్నల ముంగిట ధాన్యపు రాశులు పెద్దగా కానరావడం లేదు. 40శాతం కూడా దాటని విస్తీర్ణంలో పెట్టిన పంటలు ఎలా కాపాడుకోవాలో అని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కన్నా, ఈ సారి వ్యాపారాలు తగ్గాయని, వ్యాపార వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి.

సంక్రాంతి సంబరాలు చూసొద్దాం రండి

కామనూరులో అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు ● ఆకట్టుకునేలా ఆటల పోటీలు ● ఆకర్షణీయమైన బహుమతులు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్లె సీమకు వెలుగు నింపే పండుగ వచ్చింది. గ్రామాలు సుఖశాంతులతో, ధన ధాన్యాలతో శోభిల్లాలని వైభవంగా సంక్రాంతి ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్ల కోలాహలం మొదలైంది. జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా నాలుగు రోజులు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటేలా కామనూరు గ్రామంలో నిర్వహించనున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామం కామనూరులో ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, గ్రామ పెద్దలు, కామనూరు ప్రజల ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు, పార్వేట మహోత్సవం, లక్ష్మీప్రసన్న వేణుగోపాలస్వామి, భీమలింగేశ్వరస్వామి గ్రామోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు తరలి రానున్నారు. సంక్రాంతి సంబరాలకు తలమానికంగా నిలిచిన కామనూరు ఉత్సవాలు వైభవంగా జరిగేందుకు దేవాలయాలు, వాటి పరిసర ప్రాంతాలు, వివిధ రకాలపోటీలు నిర్వహించే మైదానంలో విద్యుత్తు లైట్లతో అలంకరించారు. పెద్ద పెద్ద స్తంభాలకు అధిక విద్యుత్తు కాంతులను వెదజల్లే లైట్లను అమర్చి ఏర్పాట్లను తీర్చిదిద్దుతున్నారు. పోటీలకు అనుగుణంగా మైదానాన్ని చదును చేయడం, సభా వేదిక, చలువ పందిర్ల ఏర్పాట్లు, తదితర పనులను ముమ్మరంగా చేపట్టారు.

భోగి సందర్భంగా

సోమవారం ఉదయం 15 ఏళ్లలోపు జూనియర్ కబడ్డీ పోటీలను (టీమ్‌కు ఏడుగురు సభ్యులు) నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో మొదటి మూడు బహుమతులు ఇస్తారు. ఉదయం 10 గంటలకు ట్రాక్టర్ అండ్ ట్రాలీ రివర్స్ పందెం నిర్వహించనున్నారు. రెండు బహుమతులు ఇస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు స్లోబైక్ రైడ్ పోటీని నిర్వహిస్తారు. ఇందులో రెండు బహుమతులు ఇవ్వనున్నారు. రాత్రి 7 గంటలకు అరుణ ఆర్కెస్ట్రా వారిచే రేలా రే రేలా సంగీత విభావరి ఏర్పాటు చేశారు. సంక్రాంతి రోజున ఉదయం 8 గంటలకు 15 ఏళ్లు పైబడిన సీనియర్ కబడ్డీ పోటీలు (టీంకు ఏడుగురు సభ్యులు) పోటీలు జరుగనున్నాయి. పోటీల్లో రెండు బహుమతులు ప్రకటించారు. మధ్యాహ్నం భోజన ఏర్పాట్లను చేయనున్నారు. కనుమ రోజు ఉదయం 5 గంటలకు ప్రసన్న వేణుగోపాలస్వామి, భీమలింగేశ్వరస్వామి దేవాలయాల్లో వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు పార్వేట మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్వేట కామనూరు నుంచి ప్రారంభమై రాధానగర్, గోపులాపురం, ఎర్రబల్లె, పెద్ద అగ్రహారం, బుక్కాయపల్లె, చిన్న అగ్రహారం, మాచనపల్లె మీదుగా 16వ తేదీ ఉదయం 6 గంటలకు గ్రామంలోని ప్రసన్న వేణుగోపాలస్వామి దేవస్థానం చేరుతుందన్నారు. అదే రోజు ఉదయం 6 గంటలకు రాయచోటికి చెందిన రవితేజ చెక్కభజన బృందంచే చెక్కభజన చేపట్టనున్నారు.



మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదిక

సుఖశాంతులతో శోభిల్లాలనీ....

ఇక్కడి స్వామివారి మూలవిరాట్టు నిర్మాణం చాలా విశేషమైంది. దశావతారాలు, గోపికలతో, పొన్నచెట్టు, గోవులతో, చతుర్భుజుడు శంఖుచక్రాలతో, వేణువుతో శ్రీకృష్ణ పరమాత్మ అత్యద్భుతంగా భక్తులకు దర్శనమిస్తూ ఉన్నారు. కామనూరులో నిర్వహించే గ్రామోత్సవం, పార్వేట మహోత్సవాలను తిలకించేందుకు వేలాదిగా భక్తులు, ప్రజలు, కళాకారులు రానున్నారు.

యుద్ధానికి సై...

16వ తేదీ ఉదయం 9 గంటలలకు సీనియర్ కేటగిరి విభాగంలో బండలాగుడు పందేలు నిర్వహించనున్నారు. ఇందులో మొదటి బహుమతిగా రాయల్‌ఇన్‌ఫిల్డ్ 350 సీసీ (బుల్లెట్) మొదటి బహుమతి, రెండో బహుమతిగా టీవీఎస్ అపాచి 160 సీసీ, మూడో బహుంతి టీవీఎస్ ఫోర్ట్ ద్విచక్ర వాహనం, 4వ బహుమతి టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100, 5వ బహుమతిగా రూ.25 వేలు నగదు, 6వ బహుమతిగా రూ.15 వేలు విజేతలకు అందజేయనున్నట్లు తెలిపారు. మిగిలిన వారికి కన్సొలేషన్ బహుమతిగా రూ.5,116 అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఈ ఎడ్ల పోటీలకు ఇప్పటికే సుమారు 18 నుంచి 20 జతల ఎద్దుల జతలు పోటీల్లో పాల్గొననున్నాయని తెలిపారు. ఎండ్ల పందేలకు పాల్గొనదలచినవారు పి.శివకాంత్‌రెడ్డి 6302087016, నంద్యాల శివనాగిరెడ్డి 6305785859, పెద్ది చంద్రశేఖర్ రెడ్డి 8309294918, నంద్యాల వరప్రసాద్‌రెడ్డి 9989357009ను సంప్రదించాలని, నేరుగానైనా వచ్చి పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఇద్దరు న్యాయాధికారులకు పదోన్నతి

కలికిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు న్యాయాధికారులకు పదోన్నతి లభించింది. కడప న్యాయాధికారి, సీనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్, ప్రొద్దుటూరు న్యాయాధికారి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి కె. సత్యకుమార్‌కు సీనియర్ డివిజన్ జిల్లా జడ్జిలుగా పదోన్నతి కల్పించారు. ఏపీ హైకోర్టు, రిజిస్ట్రారు (విజిలెన్స్) చేసిన సిఫారసులను ప్రభుత్వం ఆమోదిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా జడ్జి పోస్టుల క్యాడర్ స్ట్రెంగ్త్‌ను 157 నుంచి 173 పెంచారు. 65 శాతం కోటా కింద రాష్ట్రంలో 9 మందికి పదోన్నతులు లభించగా అందులో కడప జిల్లా నుంచి ఇద్దరు న్యాయాధికారులు స్థానం పొందారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గల్లంతైన విద్యార్థి మృతి



విలపిస్తున్న తల్లిదండ్రులు ఇన్‌సెట్‌లో బాలుడు (ఫైల్ ఫొటో)

రాజుపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గల్లైంతైన విద్యార్థి పందిటి యశ్వంత్ (7) మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు రాజుపాలెం మండలం పగిడాల వాసి యశ్వంత్ శనివారం బహిర్భూమికి వెళ్లాడు. విద్యార్థి చాపాడు కెనాల్‌లో తాపల వద్ద ప్రమాదానికి గురై నీటిలో మునిగినట్లు తెలిపారు. కాల్వలో గల్లంతవడంతో బాలుని ఆచూకీ కోసం చాపాడు కెనాల్‌ను జల్లెడ పట్టగా ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఊరి శివారులో కంప చెట్లకు తగులుకుని ఉన్నాడని ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. బాలుడి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు.

అవయవదానంతో అమరుడై...

కన్నుమూసినా జీవిస్తున్న గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

గుండె, కాలేయం, కిడ్నీలను దానం చేసిన కుటుంబీకులు



ప్రొద్దుటూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కన్ను మూసినా గుండె, కాలేయం, కిడ్నీలను దానం చేసి గోపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అమరుడయ్యాడు. కుటుంబసభ్యులు తీసుకున్న నిర్ణయం మరికొందరికి ప్రాణాలను నిలపింది. సమీప బంధువులు అందించిన వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు మండలం గోపవరం వాసి గోపిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి రాజుపాళెం మండలం గోపాయపల్లెకు చెందిన శ్రీదేవితో వివాహమైంది. వీరు సుమారు 20 ఏళ్ల కిందట హైదరాబాదులో సెటిల్ అయ్యారు. కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా హైదరాబాదులో పనిచేస్తున్నారు. కుమార్తె ప్రసన్న అమెరికాలో ఉద్యోగం చేస్తోంది. వీరికి ఇంకా వివాహాలు కాలేదు. గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఈనెల 1వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జూబ్లిహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. శనివారం గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యుల ఏకాభిప్రాయం మేరకు ఆయన అవయవాలను దానం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆస్పత్రిలో ఆయన గుండె, కాలేయం, రెండు కిడ్నీలను వేరు చేసి ఇతరులకు ప్రాణదానం చేశారు. ఆదివారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా హైదరాబాదులోని సనత్‌నగర్‌లో ఉన్న జెడ్ కాలనీలో ఇంటికి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం రాజశేఖర్‌రెడ్డి మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించినట్లు బంధువులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ఒకరికి తీవ్రగాయాలు

మారుతి శివకుమార్





ప్రకాశ్

మదనపల్లె అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రకాశ్ (55), మారుతీ శివకుమార్ (61) మృతి చెందగా ఆనంద్ గాయపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి కట్టకిందపాలెంకు చెందిన ప్రకాశ్ తిరుపతి టౌన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తన స్నేహితుడు ఆనంద్‌తో కలిసి శనివారం బెంగళూరు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద కడప నుంచి మారుతీ శివకుమార్ వెళుతున్న కారును ఆదివారం రాత్రి 9 గంటలకు ఢీకొంది. ప్రకాశ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ ఆనంద్‌ను చెన్నైకి తరలించారు. కడప వాసి మారుతీ శివకుమార్‌ను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నెల్లూరు, చిత్తూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్ 12 బాలుర ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆదివారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో

నగర్ రిమ్స్ సమీపంలో ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 126 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు కేవలం 23.3 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 130 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో

నగర శివారు ప్రాంతం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 209 పరుగులు చేసింది. ఇందులో యోగాంజనేయులు 52 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 210 పరుగులు చేసి విజయం సాధించింది. మౌనేష్ 96పరుగులు చేయగా, సోహెన్‌లతిక్ 58 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కడప మారుతీనగర్ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ, మెప్మా పీడీ సురేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మున్సిపల్ క్రీడా మైదానంలో నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి 20 టీమ్‌లు వాలీబాల్ పోటీలు కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. క్రీడల్లో ఉన్నత విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు మంచి మార్గం ఏర్పాటు అవుతుందని అన్నారు. టోర్నమెంటులో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ట్రోఫీని అందించారు. మొదటి బహుమతి కడప డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ టీం నగదు బహుమతి రూ.7వేలు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. రెండో బహుమతి సిద్దవటం టీంకు రూ.3వేలు సర్టిఫికెట్లు అందించారు.

ఉత్సాహంగా సాగిన సంగీత నృత్యోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నటరాజ కళా క్షేత్రం ఆధ్వర్యంలో రాయలసీమస్థాయి సంగీత నృత్యోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం సీమ సమా వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నతమైనవని, నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించడం బాధాకరమన్నారు. పట్టణంలో మొదటిసారిగా ఉత్సవాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. పలువురు నృత్యకారులకు రాయలసీమ నృత్యరత్న, రాయలసీమ సంగీతరత్న, విద్యార్థులకు రాయలసీమ మణిదీపిక అవార్డులను అందించారు. శ్రీచౌడేశ్వరీదేవి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పాములేటికి రాయలసీమ సంగీత రత్న అవార్డును అందించారు.



అవార్డులను అందుకున్న దృశ్యం

సంక్రాంతి కానుకగా ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు సంక్రాంతి కానుకగా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, అలాగే రాజీనామా చేసిన 12వ పీఆర్సీ కమిషనర్ స్థానంలో కొత్త కమిషనర్‌ను నియమించాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సమావేశం జిల్లా అధ్యక్షుడు పి.వి సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ ఆరు నెలల కాలంలో కొత్త జీపీఎఫ్ బిల్లులు, సీపీఎస్ కాంట్రిబ్యూషన్, ఏపీజీఎల్ఐ తదితర బిల్లులు కలుపుకొంటే మొత్తం సుమారు రూ.25 నుంచి రూ.26వేలకోట్లు ఉంటుందని, కానీ ప్రభుత్వం ఇచ్చింది రూ.1300కోట్లు మాత్రమే అన్నారు. కేవలం ఐదు శాతం చెల్లించి అదే సంక్రాంతికి పెద్ద కానుక అని ఉద్యోగులను మభ్యపెట్టాలనుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, సీపీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, ప్రదీప్, రామ్మోహన్, లక్ష్మయ్య పురుషోత్తం రెడ్డి, భాస్కర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి వెంటనే 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగర ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు నరసింహులు, రాజారావు, మణికుమార్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రారండోయ్..పండగ చేద్దాం

పెద్ద పండుగ సంక్రాంతి వచ్చింది... సందడెంతో తెచ్చింది...

పేద, పెద్ద అనే తేడా లేకుండా... తమకు స్థోమత ఉన్నంతలో పండుగ చేసుకునేందుకు జనం ఉత్సాహ పడుతున్నారు. ఇది పల్లె పండుగ కాబట్టి పట్టణ, నగర, మహానగరాల్లో ఉన్న తమ వారిని ఆహ్వానించి సామూహికంగా సంబరాల్లో మునిగిపోయేందుకు సిద్ధపడుతున్నారు. అందుకు అవసర మైన సరుకుల కోసం దుకాణాల వద్ద క్యూకట్టారు. దీంతో బట్టలు, సరుకులు, రంగులు, పూలు తదితర అంగళ్లు కిటకిటలాడాయి. జనం మోములో అప్పుడే పండుగ కళ తొణికిస లాడుతోంది. కడప నగరంలో సంక్రాంతి సందడి ఇలా...













సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకోవాలి: డీఎస్పీ



కడప క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను ప్రజలు సుఖ శాంతులతో జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాబోవు సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట నిర్వహించరాదన్నారు. కోడిపందేలు, పేకాట, జూదంలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. మాన్నారు. సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కర్యాకలాపాలు నిర్వహించరాదన్నారు. కోడిపందేలు ఆడినా, ఆడించినా వారందరిపై చర్యలు ఉంటాయన్నారు. పల్లెల్లో అక్రమంగా మద్యం అమ్మడం, బెల్టుషాపులు నిర్వహించడం, నాటుసారా తయారు చేయడం నిషేధ మన్నారు. వివిధ ఊర్లకు పోయేవారు తమ విలువైన వస్తువులు, నగలు, డబ్బు సురక్షితంగా ఉంచు కోవాలని, తమ సమీపంలో ఉన్న పోలీసుస్టేషన్లలో సమాచారం ఇవ్వాలన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

కడప కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) :సంక్రాంతి పర్వదిన సందర్భంగా మిస్సా మూవీ సహకారంతో రిమ్స్ సమీపంలోని శిల్పారామంలో సాంస్కృతిక కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు హోరెత్తాయి. శిల్పారామం పరిపాలన అధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో కడప నగరానికి చెందిన కిశోర్ బృందంతమ ఆటాపాట, డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. ఇందులో శాస్త్రీయ, జానపద, సినీ గీతాలకు యువతీ యువకులు వేసిన స్టెప్పులు అలరించాయి. ఈనెల 13న సం క్రాంతి పండుగల్లో మొదటిరోజు బోగి పండుగను శిల్పారామంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నగర ప్రజలు తప్పక హాజరు కావాలన్నారు.

చెన్నూరులో సంక్రాంతి సంబరాలు

చెన్నూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక చెన్నూరు యూత్ లాఫింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మూ డురోజుల పాటు సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ పార్కు ఆవరణంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అలాగే సోమవారం బోగి పండుగ కార్యక్రమం ముగ్గుల పోటీలు, స్లోసైక్లింగ్, బెలూన్‌కు లెమన్ స్కూలు గేమ్, మ్యూజికల్ చైర్స్ ఉంటాయన్నారు. మంగళవారం సాయంత్రం నృత్య ప్రదర్శన, ఉట్టికొట్టే కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు అద్దంకి విశ్వనాథ్, నాగార్జున, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు: సీఐ

సంక్రాంతి సందర్భంగా పోలీసు నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని సీఐ పురుషోత్తం రాజు హెచ్చరించారు. చెన్నూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు తావులేదన్నారు. కోడి పందేలు నిర్వహించేందుకు ఎవరైనా స్థలాలు అందిస్తే వారిపై కూడా చర్యలు తప్పవన్నారు.

పశువుల రక్షణకే గోకులాలు : బీటెక్ రవి

సింహాద్రిపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పశువుల రక్షణ కోసమే ప్రభుత్వం గోకులాలు నిర్మిస్తోందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గురిజాల గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులాన్ని బీటెక్ రవి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామును పరామర్శించాడు.

చిత్తశుద్ధి లేకుండా పాడా ద్వారా పనులు

లింగాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలు గుర్తించకుండా చిత్తశుద్ధి లేకుండా ఇష్టారీతిలో పాడా ద్వారా వైఎస్ కుటుంబం పనులు మంజూరు చేసిందని టీడీపీ పులివెందుల నియోజకవర్గం ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మండలంలోని దొడ్లవాగు గ్రామంలో ఆదివారం రూ.8.65లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు, రూ.2.30లక్షలతో అనిల్‌కుమార్ రెడ్డి నిర్మించిన గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు.

'అంబేడ్కర్‌కు బీజేపీ క్షమాపణ చెప్పాలి'

పులివెందుల టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ అంబేడ్కర్‌కు క్షమాపణ చెప్పాలని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ధ్రువకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. పులివెందుల మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, తొండూరు మండలాధ్యక్షులు వినోద్‌కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, సాయి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చౌకబియ్యం పట్టివేత

చెన్నూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ సమీపంలోని కేసీ ప్రధాన కాల్వ వద్ద అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 45 చౌక బియ్యం బస్తాలను చెన్నూరు పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ఈ మేరకు మచ్చా చిన్నవెంకటసుబ్బయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రుణాలు అందించేందుకు కృషి చేయాలి



గన్నేపాటి మల్లేశ్‌ను సన్మానిస్తున్న కొండా సుబ్బయ్య

కడప(వినాయకనగర్), జనవరి12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హత ఉన్న ఎస్సీలందరికీ కార్పొరేషన్ రుణాలు అందించేందుకు కృషి చేయాలని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గన్నేపాటి మల్లేశ్‌ను టీడీపీ ఎస్సీ సెల్ నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య కోరారు. ఈ సందర్భంగా గన్నేపాటి మల్లేశ్ నివాసంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్, సర్దలత, దేవ, దస్తగిరి, దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు ఆపాలి

కడప కలెక్టరేట్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కడప నగరం అశోక్‌నగర్ గ్రామ పొలం, సర్వే నెంబరు 199లో అధికార పార్టీ నేతలతో కలిసి వైసీపీ నేతలు ఆక్రమణలకు పాల్పడుతున్నారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీఎస్టీ సమానత్వపు సంక్షేమ సమితి అధ్యక్షుడు మేకల దేవా ఆదివారం ఒక ప్రకటనలో అధికారులకు విన్నవించారు.

రంగవల్లులు సంప్రదాయ ప్రతిరూపాలు

● ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య

కడప ఎడ్యుకేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి రంగవల్లులు తెలుగు సంప్రదాయ ప్రతిరూపాలు అని ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం పోలీస్‌పెరేడ్ గ్రౌండ్స్‌లో ఇంటాక్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య, పోలీసు యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగవల్లుల పోటీలు నిర్వహించారు.

యోగా గురువు అయ్యవారురెడ్డికి సన్మానం



అయ్యవారురెడ్డిని సన్మానిస్తున్న శిష్యులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరం యోగా గురువు పాలెంపల్లె అయ్యవారురెడ్డిని సం క్రాంతి సందర్భంగా ఆదివారం ఆయ న శిష్యులు సన్మానించారు. ఈ సం దర్భంగా అయ్యవారు రెడ్డి మాట్లాడుతూ తాను గత 27 ఏళ్లుగా కడపలోని ఆంధ్రప్రదేశ్ యాదాళ్లరంగమ్మ బాలికోన్నత పాఠశాలలో ఉచితంగా మహిళలు, పురుషులు, యువకులకు యోగా నేర్పిస్తున్నానన్నారు. యోగా శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. ఆసక్తి గలవారు 98850 66814ను సంప్రదించవచ్చన్నారు. యోగివేమన యోగా సెంటర్‌లో ప్రతిరోజు ఉద యం 5 నుంచి 6.30గంటల వరకు తరగ తులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

గాలిపటాలు ఎగరేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

కడప నాగరాజుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో పెద్దలు వారి వెంట ఉండి విద్యుత్ లైన్లకు దూరంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ అన్నారు. ఒకవేళ విద్యుత్ లైన్‌లకు గాని, ట్రాన్స్‌ఫార్మర్లకు గాని గాలిపటాలు చిక్కుకుంటే వాటిని తీసే ప్రయత్నం ప్రజలు చేయరాదన్నారు.

వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

చక్రాయపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ బయారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి తాల్లపల్లె మహేశ్వరరెడ్డి, లాయర్ రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వివేకానంద జయంతి కార్యక్రమం సురభి నాగులగుట్టపల్లెలో బీజేపీ రాష్ట్ర స భ్యుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సురభి హరిజనవాడకు చెందిన మహిళలకు నగదు, దుస్తులు పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. జనసేన అధ్యక్షుడు నాగమల్లయ్య, మాజీ జడ్పీటీసీ రాధాకృష్ణయ్య, ఆపస్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

వివేకానంద అడుగుజాడల్లో నడవాలి

వేంపల్లె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత వివేకానంద అడుగుజాడల్లో నడవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఒక ప్రకటనలో కొనియాడారు. తులసిరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానం భారత దేశాన్ని ప్రేమించాడని, నిద్రాణమై ఉన్న భారతీయ సమాజాన్ని జాగృతం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. దేశ సమగ్రత, గుర్తింపు కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివేకానందకు నివాళులర్పించారు.

రచయితల మహాసభలకు జస్టిస్ నాగార్జునరెడ్డిని ఆహ్వానించిన మూల

కడప కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కడపలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జరగనున్న జిల్లా రచయితల మహాసభలకు హాజరుకావాలని ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డిని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లిఖార్జునరెడ్డి ఆదివారం గండికోటలోని ఆయన స్వగృహంలో కలిసి ఆహ్వానించారు.

ఇసుక తోడేళ్లకు అడ్డుకట్ట లేదా..?

● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



పెన్నానది నుంచి పలగాడి వీధిలో నిండుగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

జమ్మలమడుగు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో పెన్నానది నుంచి ఇసుక రవాణా జోరుగా తరలిపోతోంది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం గ్రామాల్లో ప్రజలకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. రాత్రి, పగలు ఇసుక తోడేళ్లు నిద్ర లేకుండా తరలిస్తున్నారని ప్రధాన రోడ్లలో ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఉచిత ఇసుక విధానంతో జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల పెన్నానది పరిసర ప్రాంతాల్లో ఇసుక ఖాళీ అయి గుంతలు దర్శనం ఇస్తున్నాయి. అరికట్టాల్సిన అధికారులు గాలికి వదిలేసినట్లు తెలుస్తోంది. కొందరు స్థానిక అధికారులకు ఉచిత ఇసుక విధానం చేతివాటంగా మారినట్లు ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారుల్లో కొందరు నేరుగా పెన్నానదిలో ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులతో మాట్లాడుకుని అడ్డు అదుపు లేకుండా రవాణా చేస్తున్నా ఒక్కరు కూడా స్పందించడం లేదని బహిరంగ ఆరోపణలున్నాయి. జమ్మలమడుగు మండలంలోని గండికోట రోడ్డు నుంచి ముద్దనూరు రోడ్డు నుంచి అక్రమంగా ఎర్రమట్టి గ్రావెల్ రాత్రి సమయంలో తరలిస్తున్నారు. ఇసుక ఖాళీ అయి వేసవిలో బోర్లకు మంచినీరు ఇబ్బంది జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవసరానికి మించి గ్రామాల్లో ఇసుక డంప్‌లు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



టిప్పర్లలో నిండుగా ఇసుక రవాణా

ఎన్నో చెప్పారు... ఇలా వదిలారు...!

● నీరుగారిన జగనన్న పాల వెల్లువ ● మొదలుకాని పాల సేకరణ ● ఏదీ ఆర్థిక భరోసా

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పాడి తోడైతేనే లాభసాటిగా ఉంటుంది. మహిళా సాధికారికతను బలోపేతం చేయడం కోసం జగనన్న పాల వెల్లువ పథకం కీలకపాత్ర పోషిస్తుందని అప్పట్లో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు భరోసా ఇచ్చారు. అయితే క్షేత్రస్థాయిలో అందుబాటులోకి రాని పాల వెల్లువ కేంద్రాలు, లక్షలు పోసి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారడం, వేలాది పాడి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్న నిరీక్షణ మాత్రమే మిగిలింది. మొదలుకాని పాల సేకరణతో ఆర్థిక భరోసా ప్రశ్నార్థకంగా మారింది. పాల ఉత్పత్తిదారులకు కన్నీటి ఘోష మిగిలింది. దీంతో పశుపోషకుల్లో అంతులేని నైరాశ్యం కమ్మేసింది.

● **ప్రారంభించి... ఆనక మూసివేసి..:** గ్రామీణ ప్రాంతాల్లో పాడిరైతులను ఆదుకునేందుకు గత ప్రభుత్వం దూరదృష్టితో ముందడుగు వేసింది. పాల ఉత్పత్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ప్రతి 2,500 పశువులకు ఒక క్లస్టర్‌గా విభజించారు. ప్రతి మండలానికి అయిదు నుంచి 7, 8 క్లస్టర్లుగా లెక్కగట్టారు. జగనన్నపాల వెల్లువ, మహిళా డెయిరీ, సహకార సంఘం పేరున భవనాలను అందుబాటులోకి తెచ్చి వాటిల్లో పాలశీతలీకరణ కోసం యంత్రాలు, పరికరాల కోసం చర్యలు చేపట్టారు. జగనన్న పాల వెల్లువ కేంద్రాల నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధుల కింద ఒక్కోదానికి సుమారు రూ.15 లక్షల రూపాయలు కేటాయించారు. అయితే స్థలాలు, నిధుల కొరత, ముందుకు రాని గుత్తేదారుల కారణాలతో బాలారిష్టాలనుదాటనే లేదు. ముచ్చటగా రెండు,మూడు భవనాలు నిర్మించారు. వీటిలో కూడా కొన్ని చోట్ల అసంపూర్తిగా మిగిలి అలంకారప్రాయంగా మారాయి. ఒకటిరెండు చోట్ల ప్రారంభించి మూతవేశారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు విడుదలకు ముందుగా ఆర్భాటంతో పాలశీతలీకరణ కోసం యంత్రాలు, పరికరాలు లేకుండానే భవన ప్రారంభాలు చేపట్టి కథకు ముగింపు పలికారు.





నంగనూరుపల్లెలో ప్రారంభించి... మూసివేసిన నూతన భవనం

తాళ్లమాపురంలో ప్రారంభానికి నోచుకోని పాల వెల్లువ కేంద్రం

● **ఈ భవనాలను ఏం చేద్దాం..:** రూ. లక్షల ఖర్చుతో నిర్మించిన ఈ కేంద్రాల నుంచి ఇసుమంతైనా ప్రయోజనంలేకపోవడంతో గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రాథమిక సదుపాయాలు లేకపోవడంతో మూతపడిన పాల వెల్లువ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రొద్దుటూరు మండల పరిధిలో సుమారు 15 చోట్ల పాల వెల్లువ కేంద్రాలకు ఆమోదం లభించింది. అందులో కేవలం నంగనూరుపల్లి, తాళ్లమాపురంలో కట్టడాలు చేపట్టారు. రాజుపాళెం మండల పరిధిలోని అర్కటవేములలో నిధుల కొరతతో నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. దువ్వూరు మండలంలో చిన్నసింగనపల్లిలో కట్టడం పూర్తికాగా, గుడిపాడులో అసంపూర్తిగా మిగిలింది. యంత్రాలు, పరికరాల ఊసే లేదు. వీటిని ఏం చేయాలో ఈ పథకాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో అధికారులకే అర్థంకాని అయోమయ పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం వీటిపై నిర్దిష్టమైన కార్యాచరణ చేపట్టి వేలాది పాడి కుటుంబాలకు పాల అమ్మకాల్లో గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.

● **'బొమ్మా'ళి..**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా అధికారుల తీరు మారలేదు. ప్రొద్దుటూరు మండలంలోని నంగనూరుపల్లి, తాళ్లమాపురం గ్రామాల్లో నిర్మించిన పాల వెల్లువ కేంద్రాలపై నవరత్నాల లోగో, జగన్ ఫొటో అలాగే కనిపిస్తున్నాయి. ముస్తాబైన భవనాలపై మాజీ సీఎం జగన్ చిత్రాలు తొలగించకపోవడం గమనార్హం.

కేలండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సగర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ఆవిష్కరించారు. ఆదివారం సగరసంఘం కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళి, గౌరవాధ్యక్షుడు పంచగల మురళి, బి.రామక్రిష్ణ, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శులు ఆంజనేయులు, హరి, రాష్ట్ర సగర జేఏసీ సభ్యుడు సుబ్బరాయుడు, మొగిలి రామాంజనేయులు, సూర్యనారాయణ, రవి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర కేలండర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వి.ఎస్.ముక్తియార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ఇన్‌చార్జి నాసీర్‌బాష, సభ్యుడు ఆయూబ్‌ఖాన్, మస్తాన్, రెహమాన్, పవన్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌బాష పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

కొండాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక వివేకానంద స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. షబానా ఐ కేర్(తాడిపత్రి) వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంటి ఆపరేషన్ అవసరమయ్యే వారికి కర్నూల్‌కు ఉచిత వాహనం, ఖర్చులకు డబ్బులు ఏర్పాటు చేసినట్లు కరస్పాండెంట్ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, ఎంఈవో ఓబులేసు, మాజీ సర్పంచ్ విశ్వనాథరెడ్డి, డాక్టర్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత వివేకానందస్వామిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వివేకానందస్వామి జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య, గంగాధర్, సాయికుమార్, మధుసూదన్‌బాబు, ఓబులేసు, సుధాకర్, షేక్షావలి, బాబా, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: స్వామి వివేకానందుని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎర్రగుంట్ల ఎంఈవో రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎర్రగుంట్ల జడ్పీహైస్కూల్‌లోని స్వామివివేకానందుని విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చంద్ర ఓబుళరెడ్డి, బీజేపీ నాయకులు కత్తిప్రతాప్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: స్వామి వివేకానంద జయంతి వేడుకలు పోరుమామిళ్లలో ఘనంగా జరిగాయి. ఆదివారం వివేకానందుని జయంతి సందర్భంగా పోరుమామిళ్లలో వివేకానంద భవన్‌లో ఆయన విగ్రహానికి ఎస్ఐ కొండారెడ్డి, సమితి అధ్యక్ష ఉపాధ్యక్షులు కల్లూరు వెంకట్రామిరెడ్డి, మధుసూదన రావు, ఫణిరావు పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్వీనరు రామక్రిష్టారెడ్డి, పోకల సుబ్బారెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు. అలాగే ఆపస్ ఆధ్వర్యంలో శెట్టెం చెన్నయ్య వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు.



పోరుమామిళ్లలో వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బద్వేలు..: స్వామి వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని మొల్ల సాహితీపీటం వ్యవస్థాపకుడు, పట్టణ అభివృద్ధి సొసైటీ గౌరవాధ్యక్షుడు హనుమంతరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణ అభివృద్ధి సొసైటీ కార్యాలయంలో వివేకానందుని జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం మ్యాజిక్ షో మాస్టర్‌గా పలు అవార్డులు అందుకున్న వైభవ్ ప్రసాద్‌ను సన్మానించారు. పట్టణ అభివృద్ధి కమిటీ సొసైటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారు కే.వి.సుబ్బారావు, కోశాధికారి శ్రీనివాసులరెడ్డి, ఆర్యవైశ్యవర్తక సంఘం కార్యదర్శి నాగరాజు, సాధన పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: దేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కడప రామక్రిష్ణ మిషన్ కార్యదర్శి అనుపమ నందన్ పేర్కొన్నారు. ఆదివారం గీతాశ్రమం వీధిలోని స్వరాజ్య ఆశ్రమంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, శివరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వాసంతి, బీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు నాగార్జునరావు, చలపతి, నాగమునిరెడ్డి, జింకా మార్కండేయ పాల్గొన్నారు.

రేపు వెల్లాలలో పార్వేట ఉత్సవం

రాజుపాలెం, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : వెల్లాల సంజీవరాయస్వామి దేవస్థానంలో 14న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశస్వామి హనుమత్ వాహనం, గంగా పార్వతి భీమలింగేశ్వరస్వామి నందివాహనంపై పార్వేట నిర్వహిస్తున్నట్లు ఈవో నరసయ్యతెలిపారు. మంగళవారం ఉదయం చెక్కభజనలు, మేళతాళాల మధ్య పార్వేట ప్రారంభం అవుతుందన్నారు. ఈ ఉత్సవం వెల్లాల ప్రారంభమై గోపాయపల్లె, నంద్యాల జిల్లా మల్లెవేముల మండలం, రాజుపాలెం మండలంలోని దద్దనాల, పగిడాల, కుమ్మరిపల్లె, పర్లపాడు గ్రామల్లో స్వామివారి ఊరేగింపు పార్వేట జరుగుతుందన్నారు.

15న టంగుటూరులో పార్వేట..: సంక్రాంతి పండుగ సందర్భంగా కనుమ రోజున బుధవారం టంగుటూరు గ్రామంలో సోమేశ్వరస్వామి పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామచంద్రచార్యులు తెలిపారు.

కోడిపందేలు ఆడితే కఠిన చర్యలు

పోరుమామిళ్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) :సంక్రాంతి పండుగ సందర్భంగా పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో కోడిపందేలు, పేకాట వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవాలన్నారు. కోడిపందేలు, పేకాట వంటి జూదాలను ఆడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

బద్వేలు, జనవరి12(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని చపాతీ గ్రౌండ్ దగ్గర ఉన్న సర్వేనెం.914లో 03.08 సెంట్లు స్థలాన్ని పురపాలక సంఘానికి చెందిన స్థలాన్ని గుర్తు తెలియ వ్యక్తులు బోర్డును తొలగించి ఆక్రమణ చేయుటకు ప్రయత్నం చేశారని, తక్షణమే పట్టణమే ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా లేదా అక్రమ కట్టడాలు నిర్మించినా వాటిని కూల్చివేయడం జరుగుతుందన్నారు.

వెంచర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



వెంచర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదివారం ఎంఎల్ఎన్. ఇంద్రప్రస్థా వెంచర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా పుట్టా మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గం అభివృద్ధికి తాను వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తానని తెలిపారు. అనంతరం వెంచర్ ఎండీ పెరుగు వీర నారాయణ యాదవ్‌ను అభినందించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ఏపీ రవీంద్ర, మేకల బాబు, మిల్లు శ్రీను, కొండపల్లి ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై బీజేపీ వ్యాఖ్యలు దారుణం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎన్‌డీ విజయజ్యోతి

కలసపాడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌పై బీజేపీ వ్యాఖ్యలు దారుణమని ,కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లాఅధ్యక్షురాలు, బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త ఎన్‌డీ విజయజ్యోతి డిమాండ్ చేశారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కలసపాడు ,పోరుమామిళ్ల మండల కేంద్రాల్లో, రాజ్యాంగ ప్రకటన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు డాక్టర్ అన్వర్‌బాషా, సోహైల్, ముజాహిద్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా చెట్లను నరికితే చర్యలు

బద్వేలు, జనవరి12(ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె వద్ద అనుమతులు లేకుండా చెట్లు నరికిన వారిపై రూ.2వేలు జరిమానా విధించారు. ఎండిపోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను మాత్రమే సచివాలయం, పురపాలక కార్యాలయంలో గాని సంబంధిత అధికారులను సంప్రదించి అనుమతులు తీసుకుని తొలగించాలని సూచించారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

మైదుకూరు రూరల్,జనవ రి 12(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వాసవీక్లబ్,వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీ కార్యక్రమంలో జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు విరివిగా ముగ్గుల పోటీలో పాల్గొన్నారు.గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు.ఈ కార్యక్రమంలోఐఈసీ ఆఫీసర్ దొంతు సుబ్రమణ్యం, వాసవీక్లబ్ జిల్లా కేబినెట్ ట్రెజరర్ పబ్బతి గోపాల్,రీజనల్ చైర్మెన్ సూరే సుబ్బరాజు తదితరుల పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వరదపై అవినీతి ఆరోపణలు తగదు'



మాట్లాడుతున్న నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అవినీతి ఆరోపణలు చేయడం తగదని రియల్ ఎస్టేట్ వ్యాపారి నిమ్మకాల సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న 17 ఎకరాలను వెంచర్ కోసం కొనుగోలు చేశామన్నారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో మొదటి విడతగా ఏడున్నర ఎకరాలను లాండ్ కన్వర్షన్‌కు ఆర్డీవోకు దరఖాస్తు చేశామన్నారు. నెల రోజులు దాటినా అధికారులు ల్యాండ్ కన్వర్షన్‌కు చర్యలు తీసుకోకపోవడంతో ఆర్డీవోను కలువగా ఆ భూమిలో చెరువు ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయని, అందువలనే ల్యాండ్ కన్వర్షన్ ఆలస్యమవుతోందని ఒకసారి ఎమ్మెల్యేను కలువాలని సూచించారన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కొండారెడ్డి, రామచంద్రారెడ్డి, రిటైర్డు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డిలను కలిసి ఆ భూమి పట్టా భూమి అని వారికి అన్ని ఆధారాలు చూపామన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకూడదనేది ఎమ్మెల్యే ఉద్దేశ్యమని, ఆ భూముల ల్యాండ్ కన్వర్షన్ విషయంలో ఆయన ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై అవినీతి ఆరోపణలు చేయడం తగదన్నారు.

పుట్టా ప్రీమియర్ లీగ్ -10 క్రికెట్ టోర్నమెంటును సందర్శించిన ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల టీడీపీ నాయకుడు కాణాల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పుట్టాప్రీమియర్ లీగ్ -10 క్రికెట్ టోర్నమెంటు చేపట్టారు. ఆదివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పుట్టా ప్రీమియర్ లీగ్ -10 ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, రేకలకుంట్ల శివ, ఎత్తపు ఈశ్వర్‌రెడ్డి, పుట్టా ప్రభాకర్‌యాదవ్, మిల్లు శ్రీను, సన్నపూరి శ్రీను, టీడీపీ నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాడి రైతులకు వరం మినీ గోకులాలు





ఎర్రగుంట్ల..మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, పోరుమామిళ్ల.. చెన్నారెడ్డిపేటలో గోకులాలు ప్రారంభించిన టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి

మైలవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తలమంచిపట్నం గ్రామంలో మినీ గోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఉపాధి హామీ ఏపీవో ప్రసాదు, ఎంపీటీసీ బాలకొండయ్య, పాలసంజీవ్ బ్రదర్స్ సుమంత్, కొండయ్య, హుస్సేన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: మండల పరిధిలోని అర్కటవేముల గ్రామంలో జాతీయ ఉపాధి గ్రామీణ పథకం కింద మినీ గోకులం మంజూరైంది. మినీ గోకులం పూర్తి కావడంతో ఆదివారం డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ తోట మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎత్తపు ప్రభావతి, ఈవోపీఆర్‌డీ షాకీర్‌అలీఖాన్, ఏపీవో లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అట్లూరు..: మినీ గోకులాల షెడ్లు పాడి రైతులకు వరంలాంటివని మండల ఇన్‌చార్జ్ రెడ్డయ్య వెల్లడించారు. ఆదివారం వేమలూరు, మాడపూర్, కామసముద్రం గ్రామాల్లో గోకులంషెడ్లను ప్రారంభిం చారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుధాకర్, మండల టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, మద్దిక చెంచిరెడ్డి, పాలచెంచిరెడ్డి, గురుప్రసాద్, గంగి రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నరసింహులు, అయ్యవారయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మినీ గోకులాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నారెడ్డిపేట గ్రామంలో గుర్విరెడ్డి అనే రైతు నిర్మించిన మినీ గోకులాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణారెడ్డి , పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, ఫుల్లీడు సర్పంచ్ రఘునాథరెడ్డి,నాయకులు కొండా రామ క్రిష్ణారెడ్డి,కల్వకూరి చిన్న వెంకటసుబ్బయ్య, ఏపీవో రవీంద్ర రెడ్డి, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, కొండా దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు మండలంలోని శివపురంలో పశు సంవర్థక శాఖకు సంబంధించిన మినీ గోకులం షెడ్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్యసుంకులవారిపల్లె కిషోర్‌యాదవ్,నాగమోహన్,శీర్ల నాగయ్య పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో గోకులాలను (పశువుల షెడ్లు) నిర్మాణాలను చేపట్టారు. అవిపూర్తి కావడంతో ఆదివారం తోట్లపల్లె, సోమిరెడ్డిపల్లె, గొడ్లవీడు, దిగువనేలటూరు, దిరసవంచ, నాగిశెట్టిపల్లె, రేకులకుంట్ల, ముడుమాల పంచాయతీల్లో మొత్తం 13 గోకులాలను ప్రారంభించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో రంగయ్య తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో హరిక్రిష్ణ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.